సాక్షి నిర్మల్

ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



పంచతత్వానికి ప్రజాదరణ

ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీపార్కులో పంచతత్వ ఆక్యూప్రెషర్ పార్కు ఏర్పాటు చేశారు. ఇది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే తొలి పార్కు కావడం విశేషం. 8లో▸



నిర్మల్‌లో పోలీసుల కవాతు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం హనుమాన్ వీరయాత్ర నిర్వహించనుండగా శనివారం రాత్రి నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.0 /23.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం భానుడి తీవ్రత అధికంగా ఉంటుంది. గాలిలో తేమ తగ్గుతుంది. ఉక్కపోత పెరుగుతుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ ఆది: 6:29 | సహర్ సోమ: 4:46

ఆదాయం పెరిగింది



- భారీగా మద్యం అమ్మకాలు
- పన్నులూ అధికంగానే వసూలు
- రిజిస్ట్రేషన్లపై జోరుగా ఆదాయం
- మిగతా శాఖల్లోనూ ఇదేతీరు
- ఏటా పెరుగుతున్న జిల్లా ఆదాయం

నిర్మల్: జిల్లా ఆదాయం ఏడాదికేడాది మెరుగవుతోంది. వివిధ పన్నులు, అమ్మకాలు, రిజిస్ట్రేషన్ల రూపంలో రూ.కోట్ల రాబడి జిల్లా నుంచి సర్కారు ఖజానాకు చేరుతోంది. 2022–23 ఆర్థిక సంవత్సరం గడిచిపోయింది. జిల్లాలోని వివిధ శాఖలు నిర్దేశిత లక్ష్యాన్ని దాటేశాయి. అంతకుముందు ఏడాదితో పోలిస్తే అదనపు ఆదాయం సాధించాయి. ప్రధానంగా మద్యం అమ్మకాలు, పన్నులు, రిజిస్ట్రేషన్ల విషయంలో జిల్లా గత ఆదాయాలను దాటేసింది.

కిక్కు ఎక్కువైంది..

జిల్లాలో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. రోజురోజుకూ కిక్కు ఎక్కుతోంది. ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ఐఎంఎల్ (ఇండియన్ మేడ్ లిక్కర్) కంటే ఈ ఏడాది బీర్లు జోరుగా తాగారు. వైన్సులతో పాటు బార్లలోనూ అమ్మకాలు పెరిగాయి. శుభ, అశుభ కార్యాలతో పాటు ఏది జరిగినా దావత్ చేసుకునే కల్చర్ పెరుగుతుండడమే ఇందుకు కారణం. ఎక్కువ శాతం యువత బీర్లపై ఆసక్తి చూపుతుండడంతో వాటి అమ్మకాలు పెరుగుతూ వస్తున్నాయి. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఐఎంఎల్ గణనీయంగా తగ్గడం గమనార్హం. అదేస్థాయిలో బీర్లు పెరిగినప్పటికీ మద్యం అమ్మకం తగ్గింది.

రిజిస్ట్రేషన్ల జోరు..

జిల్లాగా ఏర్పడిన నుంచీ నిర్మల్‌లో రిజిస్ట్రేషన్ల శాఖకు పండుగ కొనసాగుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని మిగతా జిల్లాలతో పోలిస్తే నిర్మల్ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుండడంతో ఇక్కడ భూములకు ప్రాధాన్యం పెరుగుతోంది. స్థానికులతో పాటు చుట్టుపక్కల జిల్లాలు, మహారాష్ట్ర నుంచి వచ్చి మరీ ఇక్కడ భూములు కొనుగోలు చేస్తున్నారు. గత ఆర్థికసంవత్సరంతో పోలిస్తే జిల్లాలో ఈసారి జోరుగానే రిజిస్ట్రేషన్ల రూపంలో ఆదాయం సమకూరింది. నిర్మల్, భైంసా రెండు పట్టణాలు, ఖానాపూర్ మున్సిపాలిటీలోనూ భూక్రయవిక్రయాలు భారీసంఖ్యలో చేస్తున్నారు. నిర్మల్‌తోపాటు భైంసా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు నిత్యం రద్దీగా కనిపిస్తున్నాయి.

మద్యం అమ్మకాలు, ఆదాయం వివరాలు

ఆర్థికసంవత్సరం	ఐఎంఎల్	బీర్లు	విలువ (రూ.కోట్లలో)
2021–22	4,78,124	4,76,876	401.52
2022–23	4,19,866	6,49,801	426.20

రిజిస్ట్రేషన్లు, సమకూరిన ఆదాయం

కార్యాలయం	రిజిస్ట్రేషన్లు	ఆదాయం (రూ.లక్షల్లో)
నిర్మల్	7,987	2169.73
భైంసా	3,514	635.12

పన్నుల రూపంలో ఇలా..

జిల్లాలో జీఎస్టీతో పాటు వివిధ రూపాల్లో వసూలు చేసే పన్నుల ద్వారా రికార్డుస్థాయిలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. రాష్ట్రంలోనే వాణిజ్య పన్నుల వసూలు విషయంలో ఉమ్మడి జిల్లా డివిజన్ టాప్‌లో ఉంది. నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలు కలిపి ఆర్థిక సంవత్సరంలో రూ.46.55కోట్లు వచ్చినట్లు సంబంధిత శాఖ అధికారులు పేర్కొన్నారు. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 36.45శాతం అదనమని వెల్లడించారు. వాణిజ్య పన్నులతో పాటు ఆర్టీఏకూ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి మించి ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. క్వార్టర్లీ టాక్స్‌తో పాటు లైఫ్, గ్రీన్ టాక్స్‌లు, వివిధ ఫీజులు, సర్వీస్ చార్జీలు, తనిఖీల రూపంలో శాఖకు గణనీయంగా ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- ఐదు నిమిషాలు ఆలస్యమైతే నో ఎంట్రీ
- ‘సాక్షి’తో డీఈవో డాక్టర్ రవీందర్‌రెడ్డి



రవీందర్‌రెడ్డి, డీఈవో

నిర్మల్‌రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. గతంలో 11 పేపర్లు ఉండగా ఈసారి ప్రభుత్వం ఆరింటికి కుదించింది. జిల్లాలో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తామని డీఈవో రవీందర్‌రెడ్డి స్పష్టం చేశారు. నిర్ణీత సమయానికి ఐదు నిమిషాలు ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి నిర్ణీత సమయానికంటే ముందే కేంద్రాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి మరిన్ని వివరాలు ‘సాక్షి’కి ఇచ్చిన ఇంటర్వ్యూలో డీఈవో వెల్లడించారు.

సాక్షి: జిల్లావ్యాప్తంగా ఎన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు? ఎంతమంది సిబ్బందిని నియమించారు?

డీఈవో: జిల్లావ్యాప్తంగా 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. మాస్ కాపీయింగ్ జరగకుండా నాలుగు ఫ్లయింగ్, 30 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతోపాటు ఏడుగురు కస్టోడియన్‌లను నియమించాం. పరీక్షల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తప్పనిసరిగా గుర్తింపు కార్డు ధరించి ఉండాలి. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. వీటి సమక్షంలోనే ప్రశ్న పత్రాల కవర్లు తెరవాలి. ప్రశ్న పత్రాలను ఆయా ఠాణాల నుంచి తరలించేందుకు ప్రత్యేక వాహనం ఉంటుంది. అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకురావద్దు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పోలీస్ బందోబస్తు ఉంటుంది. సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలి.

సాక్షి: ఫీజు చెల్లించలేదని కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వడం లేదని తెలిసింది. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

డీఈవో: హాల్‌టికెట్ల జారీకి ఫీజులతో ఎట్టి పరిస్థితుల్లో ముడిపెట్టవద్దు. దీనిపై ఇప్పటికే అన్ని యాజమాన్య పాఠశాలలకు ఆదేశాలు జారీ చేశాం. కొన్నిచోట్ల విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి వస్తున్నట్లు సమాచారం అందింది. ఇలాంటి సమస్య ఎదురైనవారు డీఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే సదరు యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లను కూడా కేంద్రాల్లోకి అనుమతిస్తాం.

సాక్షి: పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి వసతులు కల్పించనున్నారు?

డీఈవో: గాలి, వెలుతురు సరిగా ఉండేలా పరీక్ష కేంద్రాలను గుర్తించాం. విద్యుత్, ఫ్యాన్లు, తాగునీరు, మూత్రశాలలు తదితర మౌలిక వసతులు కల్పిస్తున్నాం. విద్యార్థుల సౌలభ్యం కోసం పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రశాంతంగా పరీక్షలు రాసేలా చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు, తల్లిదండ్రులకు ఏవైనా సందేహాలు, ఇబ్బందులుంటే 9059987730, 7995087614 నంబర్లను సంప్రదించాలి.

సాక్షి: జిల్లాలో ఎంతమంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు?

డీఈవో: జిల్లావ్యాప్తంగా 9,078 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో 4,445మంది బాలురు కాగా 4,633 మంది బాలికలు. 6,124 మంది ప్రభుత్వ విద్యార్థులుండగా ఇందులో 2,766 మంది బాలురు, 3,358 మంది బాలికలున్నారు. 2,954 మంది ప్రైవేట్ విద్యార్థులుండగా ఇందులో 1,679 మంది బాలురు, 1,275మంది బాలికలున్నారు.

సాక్షి: పేపర్ల కుదింపు.. పరీక్షల షెడ్యూల్ వివరాలు తెలుపండి?

డీఈవో: గతంలో 11 ప్రశ్న పత్రాలుండేవి. ఈసారి ఆరు ప్రశ్న పత్రాలు మాత్రమే ఉంటాయి. తెలుగు, సైన్స్ పరీక్షలకు అదనంగా 20 నిమిషాలు సమయం ఉంటుంది. ఏప్రిల్ 3న తెలుగు పేపర్–1 (పార్ట్ ఏ) ఉదయం 9.30 నుంచి 11.30 వరకు, పేపర్–2 (పార్ట్ బీ) 11.50 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు ఉంటుంది. మధ్యలో 20 నిమిషాలు పేపర్–1 సమాధాన పత్రాలు తీసుకొని పేపర్–2 ప్రశ్న పత్రం ఇవ్వడానికి కేటాయించాం. అలాగే 10న సైన్స్ పేపర్–1 (భౌతిక, రసాయన శాస్త్రం) ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, పేపర్–2 (జీవశాస్త్రం) 11.50 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు ఉంటుంది. మిగతా పరీక్షలన్నీ యథావిధిగా ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకే ఉంటాయి.

న్యూస్‌రీల్

పీహెచ్‌సీని పరిశీలించిన సివిల్‌జడ్జి జితిన్‌కుమార్



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న జితిన్‌కుమార్

దస్తురాబాద్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శనివారం ఖానాపూర్ జూనియర్ సివిల్‌జడ్జి జితిన్‌కుమార్ పరిశీలించారు. పీహెచ్‌సీలో వైద్యసేవలు, పరిశుభ్రత వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్య పరికరాలు పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి నమోదైన కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట పీహెచ్‌సీ, ఠాణా సిబ్బంది ఉన్నారు.

నేడు మొల్లమాంబ విగ్రహావిష్కరణ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదురుగా తొలి తెలుగు కవయిత్రి కుమ్మర మొల్లమాంబ కాంస్య విగ్రహాన్ని ఆదివారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆవిష్కరిస్తారని కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి గంగాధర్, రాజకీయ విభాగం అధ్యక్షుడు కొత్తపల్లి బుచ్చన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి తొడిశెట్టి రవికాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి రాంకిషన్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, విగ్రహదాత నార్లాపురం రవీందర్, మొల్లమాంబ పుస్తక రచయిత తోడిశెట్టి పరమేశ్వర్, కుల సంఘం రాష్ట్ర బాధ్యులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

4న డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

నిర్మల్‌చైన్‌గేట్: భైంసా పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపునకు ఈనెల 4న లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు భైంసా ఆర్డీవో రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే అందిన దరఖాస్తులను వివిధ దశల్లో తహసీల్దార్లు పరిశీలించిన అర్హుల జాబితాను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆయా వార్డు సభల్లో జాబితాను ఇప్పటికే ప్రదర్శించినట్లు తెలిపారు. ఈనెల 4న ఉదయం 10గంటలకు జిల్లా కేంద్రంలోని శ్రీగౌరీ శంకర్ గార్డెన్స్‌లో లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, ఇతర ధ్రువపత్రాలతో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

నేడు ‘మొల్లమాంబ సాహితీ వైభవం’ పుస్తకావిష్కరణ

నిర్మల్‌రూరల్: కుమ్మర సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ‘మొల్లమాంబ సాహితీ వైభవం’ పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నట్లు సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి గంగాధర్, ప్రధాన కార్యదర్శి కానూరి సతీశ్ ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట మొల్లమాంబ కాంస్య విగ్రహం ఆవిష్కరణ అనంతరం ప్రముఖ కవి, రచయిత, జాఫ్రాపూర్ హైస్కూల్ హెచ్‌ఎం తోడిశెట్టి పరమేశ్వర్ రాసిన ఈ పుస్తకాన్ని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. కవులు, కళాకారులు, రచయితలు, కుమ్మర కులస్తులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

కొండగట్టుకు అంజన్న దీక్షాపరుల పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న దీక్షాపరులు

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామానికి చెందిన సుమారు 65మంది ఆంజనేయ స్వామి దీక్షాపరులు శనివారం జగిత్యాల జిల్లా కొండగట్టు హనుమాన్ ఆలయానికి పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. సుమారు 120 కిలోమీటర్ల దూరంలోని ఆలయానికి చేరుకునేందుకు మూడురోజుల సమయం పడుతుందని దీక్షాపరులు తెలిపారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో పాదయాత్రను ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు దీక్షాపరులకు హారతులిచ్చి గ్రామ పొలిమేరవరకు సాగనంపారు. గురుస్వాములు ప్రశాంత్, లక్ష్మణ్, నర్సయ్య, ముద్రం లక్ష్మణ్ తదితరులున్నారు.

గొర్రెల పంపిణీని పకడ్బందీగా చేపట్టాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: రెండో విడత గొర్రెల పంపిణీని పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఆయన సీఎస్ శాంతికుమారి, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని లబ్ధిదారులతో అవగాహన సమావేశాలు నిర్వహించి వారి వాటా సేకరించాలని పేర్కొన్నారు. గొర్రెల కొనుగోలుకు సంబంధించి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి కలెక్టర్ల ఆధ్వర్యంలో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. జిల్లాలకు చేరిన ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలు త్వరగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించాలని తెలిపారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఈ నెల 30వరకు జీవో 58, 59 కింద నూతన దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లను త్వరగా లబ్ధిదారులకు కేటాయించాలని సూచించారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అదన కలెక్టర్ రాంబాబు, వైద్యులు సురేశ్, రాజేందర్, శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

‘స్త్రీనిధి లక్ష్యంలో ప్రథమ స్థానం దక్కడం గర్వకారణం’



డీఆర్డీవోను అభినందిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: స్త్రీనిధి లక్ష్యంలో రాష్ట్రంలో నిర్మల్ ప్రథమ స్థానం సాధించడం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. స్త్రీనిధి లక్ష్యం సాధించి మొదటి స్థానంలో నిలిచినందుకు, ముజ్గి ఆరోగ్య గ్రామపంచాయతీకి రాష్ట్రస్థాయి పురస్కారం రావడాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో డీఆర్డీవో విజయలక్ష్మిని ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2021–22 ఆర్థిక సంవత్సరానికి స్త్రీనిధి రుణాలు, 4.56 టార్గెట్, 6.63 ప్రగతితో 163శాతంతో ముధోల్ సరస్వతి మండల సమాఖ్య తెలంగాణలోనే మొదటిస్థానంలో నిలిచిందన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి జాతీయ స్థాయిలో జిల్లా పేరు నిలుపాలని ఆకాంక్షించారు. ఇందుకు తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు. ఎంపీడీవో సాయిరాం, ఎంపీవో సురేశ్‌బాబు, సర్పంచ్ పీ రాజమణి, పంచాయతీ కార్యదర్శి సరిత పాల్గొన్నారు.

వీసీ, డైరెక్టర్‌కు సన్మానం



డైరెక్టర్‌ను సన్మానిస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది

భైంసా: బాసర ఆర్జీయూకేటీ వీసీ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్‌కుమార్‌ను వర్సిటీ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది శనివారం సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం పీఆర్సీ జీవోను అమలు చేయడంతోపాటు రెండోవిడత బకాయిలు చెల్లించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామంలో గల రామాలయంలో శనివారం అంగరంగవైభవంగా సీతారాముల కల్యాణం జరిపించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు ఇతర గ్రామాల నుంచీ భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రసూతి ఆసుపత్రిని పరిశీలిస్తున్న లక్ష్మీసంతోషి

నిర్మల్‌చైన్‌గేట్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు లక్ష్మీసంతోషి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మహిళా మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ మహిళలకు పెద్దపీట వేస్తూ స్త్రీనిధి పేరిట రుణాలు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు రజిని వైద్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు అలివేలు, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్మల, స్రవంతి, ఉపాధ్యక్షులు భూలక్ష్మి, శ్రీలత, అలివేలు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రసూతి ఆసుపత్రి పరిశీలన

ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు లక్ష్మీసంతోషి జిల్లా కేంద్రంలోని ప్రసూతి ఆస్పత్రిని సందర్శించారు. చికిత్స పొందుతున్న బాలింతలతో మాట్లాడి ఆస్పత్రి సేవల గురించి తెలుసుకున్నారు. నార్మల్ డెలివరీలు జరిగేలా ప్రోత్సహించాలని వైద్యులకు సూచించారు.

‘బీసీలకు రాజ్యాధికారమే ఓబీసీ మోర్చా లక్ష్యం’



సమావేశంలో మాట్లాడుతున్న స్వామియాదవ్

నిర్మల్‌చైన్‌గేట్: బీసీలకు రాజ్యాధికారం కట్టబెట్టడమే ఓబీసీ మోర్చా లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జి మాదాసు స్వామియాదవ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు దడిగే భోజన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామియాదవ్ మాట్లాడారు. సకలజనులు పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో బీసీలను అన్ని రంగాల్లో అణిచివేస్తూ రాజ్యాధికారాన్ని దూరం చేసిన కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు. ఈనెల 6నుంచి 14వరకు ‘పల్లెపల్లెకు ఓబీసీ.. ఇంటింటికీ బీజేపీ’ మహాభియాన్ కార్యక్రమానికి స్వీకారం చుట్టామని, విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధికార ప్రతి నిధి అమరవేణి నర్సాగౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రభారి, బీజేపీ ప్రధాన కార్యదర్శి మేడిచెల్మ రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నం నారాయణగౌడ్, ఎడ్లోల్ల నాగ్‌నాథ్, రావుల పోశెట్టి, గాజుల్‌వార్ లింబాద్రి, జిల్లా అధ్యక్షుడు గడిగే భోజన్న, ప్రధాన కార్యదర్శులు గొస్కుల మల్లేశ్, ఐడ్ల రమేశ్, నాయకులు తోట సత్యనారాయణ, గుడాల రాజన్న, కరెగిరి శ్రీనివాస్, దొనికేని స్వామి, పెట్టం చంద్రశేఖర్, పుప్పాల పవన్, కలెరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగ..



మధ్యాహ్నం నిర్మానుష్యంగా నిర్మల్ ప్రధాన రహదారి



చెట్టునీడన సేదతీరుతున్న పశువులు



డివైడర్ మధ్యలో చెట్టుకింద కూర్చున్న వృద్ధురాలు

నిర్మల్ జిల్లా కేంద్రంలో రోజురోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మధ్నాహ్నం జనం బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. శనివారం 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మధ్యాహ్నం జనం లేక రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. కొద్దిపాటి మంది వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చినా పలు జాగ్రత్తలు తీసుకున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

హనుమాన్ భక్తుల చాలీసా పారాయణం



గీతాలాపన చేస్తున్న శ్రీనివాస్, దీక్షాపరులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్‌కాలనీలోగల జంగల్ హనుమాన్ సాయిబాబా ఆలయ ఆవరణలో శనివారం అఖండ హనుమాన్ చాలీసా పారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు రామోజుల రామకృష్ణశర్మ, మల్లేశ్, శశిధర్‌శర్మ ఆధ్వర్యంలో హనుమాన్ దీక్షాపరులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ ఉపాసకుడు బోగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తి గీతాలాపన చేపట్టారు. అనంతరం భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వచ్ఛదూత్‌గా నవత ఎంపిక


నవత

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌కు చెందిన తన్నీరు నవత స్వచ్ఛ దూత్‌గా ఎంపిక య్యారు. రాష్ట్రంలోని పది జిల్లాల నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేయగా ఆదిలాబాద్ జిల్లా నుంచి ఆమె ఎంపికయ్యారు. మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా హీన ఏరియా లెవెల్ ఫెడరేషన్ రిసోర్స్‌పర్సన్‌గా పనిచేస్తున్న ఆమె కర్నాటక రాష్ట్రం బెంగళూరులో గతనెల 16 నుంచి 18 వరకు జరిగిన స్వచ్ఛతోత్సవ్ కార్యక్రమానికి జిల్లా నుంచి పాల్గొన్నారు. ఢిల్లీలో గతనెల 29న జరిగిన ఇంటర్నేషనల్ డే ఆఫ్ జీరో వేస్ట్‌లో తెలంగాణలోని 10 మంది సభ్యుల్లో భాగంగా నవత పాల్గొని స్వచ్ఛదూత్‌గా ఎంపికయ్యారు. ఆమె ఎంపిక పట్ల మెప్మా డీపీఎం శ్రీనివాస్, మెప్మా ఆర్‌పీలు హర్షం వ్యక్తం చేస్తు ఆమెకు అభినందనలు తెలిపారు.

ఏడుగురికి సూపరింటెండెంట్లుగా పదోన్నతి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఏడుగురికి సూపరింటెండెంట్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని ఆ శాఖ డైరెక్టరేట్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. వారికి పోస్టింగ్‌లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న అడెపు మహేందర్ రిమ్స్‌కు, వెంకటరమణ రిమ్స్ కళాశాలకు, జగదీశ్ జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి పదోన్నతిపై బదిలీ అయ్యారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న రవీందర్ ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో కార్యాలయానికి, రిమ్స్ నర్సింగ్ కళాశాలలో పనిచేస్తున్న సందీప్‌రెడ్డికి అదే కళాశాలలో, ఇచ్చోడ పీహెచ్‌సీలో పనిచేస్తున్న జి.గోపికి డీఎంహెచ్‌వో కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు. అలాగే జగిత్యాల మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న టి.గోపికి రిమ్స్ కళాశాలలో సూపరింటెండెంట్‌గా పదోన్నతి లభించింది. వీరికి పదోన్నతులు లభించడంపై అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

కత్తి దాడిలో ఒకరికి గాయాలు

నిర్మల్‌టౌన్: తన దుకాణం ఎదుట బైక్ పెట్టవద్దని అన్నందుకు ఒకరిపై కత్తితో దాడి చేసిన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పాత బస్టాండ్ ఏరియాలో అబ్దుల్ ఘనీ (45) టైలర్ దుకాణం నడుపుతున్నాడు. తన దుకాణం ఎదుట సోఫీనగర్‌కు చెందిన ఆయాన్ రెండు రోజుల క్రితం బైక్ పార్కింగ్ చేశాడు. దుకాణం ఎదురుగా బైక్ పెట్టవద్దని, తీసేయాలని అబ్దుల్ ఘనీ చెప్పాడు. దీంతో ఆగ్రహానికి గురైన ఆయాన్ అతడితో గొడవకు దిగాడు. ఇది మనసులో పెట్టుకుని శనివారం సాయంత్రం దుకాణానికి వచ్చి వెనుక నుంచి కత్తితో ఘనీపై దాడి చేశాడు. స్థానికులు చూడగా అక్కడ నుంచి పారిపోయాడు. గాయాలైన ఘనీ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు. ఘనీ భార్య రిజ్వానా బేగం ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు.

పంచతత్వానికి ప్రజాదరణ


పార్కులో వాకింగ్ చేస్తున్న వాకర్స్

- ఆదిలాబాద్‌లో ఆక్యుప్రెషర్ పార్కు
- నడకకు పలువురి ఆసక్తి

ఆదిలాబాద్: పట్టణ ప్రజలకు ఆహ్లాదంతోపాటు ఆరోగ్యం కోసమే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీపార్కులో పంచతత్వ ఆక్యుప్రెషర్ పార్కు ఏర్పాటు చేశారు. రూ.7 లక్షల వ్యయంతో నిర్మించిన పార్కులో 12 ఎంఎం, 4 ఎంఎం కంకర నల్ల రేగడి మట్టి, ఇసుక రేణువులు, గులకరాళ్లు నీటితో కూడిన వాకింగ్ ట్రాక్ సిద్ధం చేశారు. ట్రాక్‌పై చెప్పులు లేకుండా నడవడం ద్వారా అన్ని అవయవాలకు రక్తప్రసరణ జరిగి శరీరంలోని నాడులన్నీ ఉత్తేజితమవుతాయని వైద్యులు చెబుతున్నారు. ఇది ఉమ్మడి జిల్లాలోనే తొలి పార్క్ కావడం విశేషం. ఈ పార్క్ ప్రారంభమైనప్పటి నుంచి ప్రజల తాకిడి ఎక్కువవుతోంది. పార్కు వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతున్నాయని వాకర్లు చెబుతున్నారు. వారి మాటల్లోనే తెలుసుకుందాం.

యోగా సాధనకు ఏర్పాట్లు చేయాలి



పంచతత్వ పార్కును పచ్చని చెట్ల మధ్య ఏర్పాటు చేయడం వల్ల ఎంతో ప్రశాంతతను చేకూరుస్తుంది. పార్కులో నడవడంతో శరీరానికి సరైన రక్తప్రసరణ జరిగి రిలాక్స్‌గా అనిపిస్తుంది. ఇందులో నడిచిన అనంతరం యోగా చేస్తున్నాం. పార్కు పరిసరాల్లో ఉన్న ఖాళీ స్థలంలో గడ్డిని ఏర్పాటు చేస్తే యోగా చేసుకోవడానికి వీలవుతుంది.

– అనిత, శాంతినగర్, ఆదిలాబాద్

కొత్త అనుభూతి



ప్రతిరోజు నడిచే నడక కంటే ఇందులో నడవడం వల్ల కొత్త అనుభూతి కలుగుతుంది. బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులు అదుపులో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. పంచతత్వ పార్కులను పట్టణంలో మరికొన్ని చోట్ల ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– శివాజీ, ఆదిలాబాద్

నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి



పార్కు నిర్వహణను మరింత పకడ్బందీగా చేపడితే వాకర్లు ఎక్కువ సంఖ్యలో రావడానికి అవకాశం ఉంటుంది. వాకింగ్ ట్రాక్‌లో నీటిని రోజు శుభ్రపరచి కొత్త నీటిని నింపితే బాగుంటుంది. రోజులుగా నీరు అలాగే నిల్వ ఉండడంతో అడుగు భాగంలో పాకురు ఏర్పడి జారిపడిపోయే అవకాశాలున్నాయి. అధికారులు దృష్టి సారించాలి.

– మహేశ్, బ్రహ్మణ్‌వాడ, ఆదిలాబాద్

అవగాహన కల్పించాలి



నా కుమారుడితో కలిసి ఈ పార్కులో నడుస్తున్నా. థీమ్ పార్కు ఏర్పాటుతో ఆరోగ్యంపైన ప్రతి ఒక్కరికి శ్రద్ధ పెరుగుతుంది. నా కుమారుడికి వ్యాయామం గురించి అవగాహన కల్పించడమే కాకుండా స్వయంగా చేయిస్తున్నా. తల్లిదండ్రులు ఈ దిశగా ఆలోచించి పిల్లలకు అలవాటు చేయాలి.

– సంజీవ్, శాంతినగర్, ఆదిలాబాద్

ట్రాక్‌పై నడవడానికి ఆసక్తి



గత మూడు నెలల నుంచి ప్రతిరోజు ఉదయం 5 నుంచి 10 రౌండ్లు వాకింగ్ చేస్తున్నా. ఈ పంచతత్వ పార్కును పంచభూతాలను థీమ్‌గా తీసుకుని ఏర్పాటు చేసినట్లు తెలిసింది. పంచ భూతాలే జీవ కోటి మనుగడకు ఆధారం. అటువంటి పార్కుకు వాకర్లు ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఈ ట్రాక్‌పై నడవడానికి ఆసక్తి చూపుతున్నారు.

– సతీశ్, ఓల్డ్ హౌసింగ్ బోర్డ్, ఆదిలాబాద్

వివాహిత ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు

భీమిని: మండలంలోని చిన్నగుడిపేట గ్రామానికి చెందిన మురికి కళావతి(19) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. తాండూర్ మండలం రేచిని గ్రామానికి చెందిన మురికి మల్లేష్‌తో గత సంవత్సరం కళావతికి వివాహం జరిగింది. నెల రోజులుగా తల్లిగారి ఇంటికి వచ్చి ఉంటోంది. కాపురానికి వెళ్లనని తల్లిదండ్రులకు చెబుతూ ఉండేది. మనస్తాపం చెంది శనివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి ఈరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమిని ఎస్సై వెంకటేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


సిడాం శ్రవణ్ మృతదేహం

భీమిని: మండలంలోని ఖర్జీభీంపూర్ గ్రామానికి చెందిన సిడాం శ్రవణ్(40) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. గత నెల 26న బంధువుల వివాహానికి వెళ్లి అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. గుర్తు తెలియని క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. కుటుంబీకులు బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం చనిపోయాడు. మృతుడి భార్య శకుంతల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

వివాహిత..


స్వప్న (ఫైల్)

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్‌కు చెందిన వివాహిత స్వప్న(28) చికిత్స పొందుతూ చనిపోయింది. ఎస్సై లక్ష్మణ్ వివరాల ప్రకారం.. గత నెల 30న గ్రామానికి చెందిన మరో మహిళతో గొడవ జరిగింది. ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగి దూషించుకున్నారు. దీంతో మనస్తాపం చెందిన స్వప్న శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగింది. కుటుంబీకులు మంచిర్యాలకు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి శనివారం చనిపోయింది. ఆమెకు ముగ్గురు పిల్లలున్నారు. భర్త రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

లక్ష్మణచాంద: మతిస్థిమితం లేక ఒకరు ఇంట్లో ఉరేసుకుని మృతిచెందిన సంఘటన సోన్ మండలం కద్తాల్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కద్తాల్‌కు చెందిన మస్కాపురం రాము (26) గత పదేళ్ల కిందట వివాహమైంది. కుమారుడు జన్మించిన అనంతరం భార్య మృతిచెందింది. 2016 నుంచి రాము మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నారు. శుక్రవారం రాత్రి సమయంలో తల్లి అన్నం పెట్టి వెళ్లింది. తర్వాత ఇంట్లో ఒక్కడే ఉండటంతో ఉరేసుకుని మృతిచెందాడు. శనివారం ఉదయం తల్లి తలుపు తట్టగా ఎంతకు తీయకపోవడంతో కిటికీల్లోంచి చూడగా ఇనుప రాడ్‌కు వేలాడుతూ కనిపించాడు. చుట్టుపక్కల వారు తలుపులు తీశారు. తమ్ముడు భీమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

గుండెపోటుతో ప్రిన్సిపాల్ మృతి


ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు (ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కార్ల వెంకటేశ్వర్లు(56) శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. శనివారం ఇంటర్మీడియెట్ చివరి పరీక్ష విధులకు హాజరయ్యాడు. మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో మంచిర్యాల శివారు గద్దెరాగడిలోని ఇంటికి వెళ్లాడు. ఆయన భార్య బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు శ్రీలత ఇంటికి వచ్చి చూసేసరికి పడిపోయి ఉన్నాడు. మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వెంకటేశ్వర్లుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం స్వస్థలం కాగజ్‌నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

యువకుడి అదృశ్యం

లక్ష్మణచాంద: సోన్ మండలం బొప్పారానికి చెందిన అఖిలేష్ (23) కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. అఖిలేష్ గత రెండు నెలల నుంచి నిర్మల్‌లోని ఓ ఫొటోషాప్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి నిర్మల్‌కు బైక్‌పై వెళ్లాడు. రాత్రి 7 గంటలైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. యజమానికి ఫోన్ చేయగా అఖిలేష్ పనికి రాలేదని చెప్పారు. అఖిలేష్ ఆచూకీ కోసం బంధువులకు ఫోన్ చేసినా ఫలితం లేకపోయింది. అఖిలేష్ అన్న శ్రీకాంత్ ఫిర్యాదుతో శనివారం ఆదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

తేనెటీగల దాడిలో ఒకరికి గాయాలు

ఇంద్రవెల్లి: మండలంలోని వాల్గొండ పంచాయతీ పరిధిలోని పోల్లుగూడలో శనివారం సాయంత్రం తేనెటీగల దాడిలో ఒకరికి గాయాలయ్యాయి. సిడాం దస్రు వ్యవసాయ పనులు చేస్తుండగా ఒక్కసారిగా తెనేటీగలు దాడి చేసి గాయపర్చాయి. కుటుంబీకులు ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గంజాయి కేసులో మరొకరి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: గత ఫిబ్రవరి 22న మహారాష్ట్రకు రెండు వాహనాల్లో 8 మంది కలిసి గంజాయి తరలిస్తుండగా మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై పట్టుబడ్డ విషయం తెలిసిందే. ఆ సమయంలో నలుగురిని అరెస్టు చేయగా గంజాయి కేసులో పరారీలో ఉన్న నలుగురిలో ఓ వ్యక్తిని గతనెలలో అరెస్టు చేశారు. వారిలో సద్దాం ఉస్సేన్‌ను శనివారం జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ రఘుపతి తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

లక్సెట్టిపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన రాజేందర్ (26) మృతిచెందాడు. శుక్రవారం రాత్రి దండేపల్లి మండలం చింతపల్లికి వెళ్లి బైక్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.



అమ్మవారి సన్నిధిలో ప్రముఖులు

భైంసా: బాసర శ్రీ జ్ఞానసరస్వతి అమ్మవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట ట్రిపుల్ ఐటీ వీసీ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్‌కుమార్ ఉన్నారు. అలాగే నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్ నీతూకిరణ్ అమ్మవారిని దర్శించుకున్నారు.

బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యం

- తెలంగాణ ప్రవాస్ ఇన్‌చార్జి లక్ష్మీప్రసన్న


మాట్లాడుతున్న లక్ష్మీ ప్రసన్న

ఆదిలాబాద్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తెలంగాణ ప్రవాస్ ఇన్‌చార్జి లక్ష్మీప్రసన్న అన్నారు. జిల్లాకేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ప్రవాస్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని ప్రచారం నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు ప్రతి ఒక్కరికి తెలియజేసేలా అవగాహన కల్పించాలన్నారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ధోని జ్యోతి, రాష్ట్ర నాయకురాలు చిలుకూరి జ్యోతిరెడ్డి, ఇన్‌చార్జి ఉమామహేశ్వర్‌రెడ్డి నివేదిత వజే, పద్మా గౌడ్, హరిత, అనిత తదితరులు పాల్గొన్నారు.

సీఓఈలో నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్


మాట్లాడుతున్న ఎన్‌వైకే అధికారి సుశీల్‌బాద్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) కళాశాలలో శనివారం జిల్లా స్థాయి నైబర్ హుడ్ యూత్ పార్లమెంటు కార్యక్రమం నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం, యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థి, యువజనులకు అవగాహన కల్పించారు. నెహ్రూ యవకేంద్ర, జిల్లా యువజన అధికారి సుశీల్‌బాద్ మాట్లాడుతూ 2022–23 విద్యాసంవత్సరంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా స్థాయిలో నైబర్ హుడ్ పార్లమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. జీ 20 శిఖరాగ్ర సమావేశం సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో జరుగుతుందని వివరించారు. విద్యార్థి, యువజనులకు అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా యూత్ పార్లమెంట్ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అనంతరం యూత్‌పార్లమెంట్ నిర్వహించారు. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌పై చర్చలో విద్యార్థి, యువజనులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు గజ్జెల్లి మోహన్, సీఓఈ అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగ చోరీ



నిర్మల్‌రూరల్: మండలంలోని మేడిపల్లి శివారులో గల పంటచేలలో ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగను గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చోరీ చేశారు. శనివారం ఉదయం గుర్తించిన ఆరుగురు రైతులు పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్సై చంద్రమోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కలప తరలిస్తున్న కారు పట్టివేత

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని కవ్వాల్ నుంచి అక్రమంగా కలప తరలిస్తున్న కారును శనివారం పట్టుకున్నారు. ఇందన్‌పల్లి రేంజ్ అధికారి హాఫీజొద్దీన్ తెలిపిన వివరాలు.. పక్కా సమాచారంతో సిబ్బంది అక్కడికి వెళ్లి తనిఖీలు చేయగా కారులో రెండు కలప దుంగలు ఉన్నట్లు తెలిపారు. డ్రైవర్ పారిపోయాడు. కలపతో సహా కారును సీజ్ చేసి డివిజన్ కేంద్రానికి తరలించామన్నారు. కలప విలువ సుమారు రూ.15 వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

యువత.. జర జాగ్రత్త!

- మందు, విందులతో ఎర
- తమ వెంట తిప్పుకుంటున్న నాయకులు
- నేతల ఉచ్చులో పడొద్దంటున్న మానసిక వైద్యనిపుణులు

బోథ్: ఆరే రాజు..రేపు మన పార్టీ సమావేశం ఉంది. పది మంది పోరగాళ్లను రెడీ చేయ్..ప్లెక్సీలు కట్టాలే..రేపటి మీటింగ్‌లో మొత్తం మనమందే ఉండాలె. మన గురించే నినాదాలు చేయాలా..ఇంటికి వచ్చి పది వేలు తీస్కపో..అని ఓ నేత నుంచి యువకుడికి ఫోన్‌చేశాడు. వెంటనే అతని ఇంటికెళ్లి డబ్బులు తీసుకుని ప్లెక్సీలు ఏర్పాటు చేశాడు. మిగిలిన డబ్బులతో మందు పార్టీ చేసుకున్నారు. రాజకీయ నాయకుడి వెంట తిరగడానికి, తనకోసం జేజేలు కొట్టించడానికి, గొడవలు అయితే తన బలగం చూపెట్టడానికి యువతే కీలకం. ప్రతి విషయంలో నాయకులు, ప్రజాప్రతినిధులకు వారి అవసరం ఉంది. ఎన్నికల సందర్భాల్లో, రాజకీయ ప్రభుత్వ అధికార కార్యక్రమాలు, ర్యాలీలు, నిరసనల్లో యువతను వినియోగించుకుంటున్నారు. ఇందుకు మందు, విందులతో ఎరవేస్తూ మభ్యపెడుతున్నారు. నాయకుల వెంట తిరుగుతూ, మద్యానికి బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. ఎన్నికల్లో గెలిచాక వారిని పక్కన పెట్టేస్తున్నారు. పిల్లలు నాయకుల వెంబడి తిరుగుతూ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఒక్క క్షణం ఆలోచించాలి



ప్రస్తుత రోజుల్లో నాయకుల వెంట యువత తిరుగుతున్నారు. మద్యానికి బానిసై నాయకులతో తిరిగి సమయం వృథా చేసుకుంటున్నారు. తమ బంగారు భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారు. ఒక్క క్షణం ఆలోచించాలి. తల్లిదండ్రులు ఆశలను నెరవేర్చాల్సిన బాధ్యత వారిపై ఉంది.

– ఓంప్రకాశ్, మానసిక వైద్య నిపుణులు

కుమారుడి భవిష్యత్ నాశనం చేస్తున్నారని..

బోథ్ మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఇంటర్మీడియట్ పాసై డిగ్రీలో చేరాడు. గత సర్పంచ్ ఎన్నికల్లో యువకుల అవసరం ఉందని భావించిన ఓ నేత కొంతమంది యువకులకు గాలం వేశాడు. ఎన్నికల సమయంలో ఆ యువకులను తమ వెంట తిప్పుకున్నాడు. రోజు మద్యం బాటిళ్లను అందించాడు. ఆ నేత దగ్గరకు వెళ్లవద్దని తల్లిదండ్రులు కుమారుడికి వారించినా వినలేదు. దీంతో ఆగ్రహంతో నాయకుడితో గొడవ పెట్టుకున్నారు. కుమారుడి భవిష్యత్తు నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. కాగా, ఆ నాయకుని ముందు తల్లిదండ్రులు, కుమారుడు గొడవపడ్డారు. తల్లి ఏడ్చుకుంటూ వెళ్లిపోయింది.

తన వెంట తిప్పకుని..

బోథ్ మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు డిగ్రీ చదువుతున్నాడు. గ్రామానికి చెందిన ఓ నేత అతన్ని దగ్గరకు తీశాడు. ఆ నేత పుట్టినరోజు సందర్భంగా సదరు యువకుడిని పిలిచి హంగామా చేయాలని చెప్పాడు. యువకుడితో అతని స్నేహితులు రాత్రంతా మేల్కొని ప్లెక్సీలు కట్టారు. సదరు నేత రూ.20 వేలు మందు, విందు ఏర్పాటు చేయడంతో అతని వెంట తిరగసాగారు. ఆదిలాబాద్, నిర్మల్‌తోపాటు ఆ నాయకుడు ఎక్కడి వెళ్లినా వారిని తీసుకెళ్తున్నాడు. డిగ్రీ చదివే ఆ యువకులు రోజు మద్యం తాగి ఇంటికి రావడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేసు నమోదైనా ఏం చేయలేనని చెప్పి..

ఆదిలాబాద్ జిల్లాలోని ఓ మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి తమ వెంట యువకులను తిప్పుకుంటే తనకు పలుకుబడి పెరుగుతుందని భావించాడు. తన బంధువైన ఓ యువకుడిని అతని స్నేహితులను పిలిపించి ప్రతి రోజు మందు, బిర్యానీ ఏర్పాటు చేశాడు. సమావేశాల్లో ఆ నేత ప్రసంగిస్తున్నప్పుడు యువకులు నేత పేరుతో నినాదాలు చేశారు. కొన్ని రోజుల తర్వాత ఆ గ్రామంలో యువకులకు కొంతమందికి గొడవ జరిగింది. దీంతో వారిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీని గురించి తమ నేతకు ఫోన్ చేసి చెబితే తాను ఏం చేయలేనని చెప్పేశాడు.